
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# వంటింట్లో గల్ఫ్ మంటలు






### జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఎల్‌పిజి గ్యాస్ కొరత
### నిలిచిపోయిన ఆన్‌లైన్ బుకింగ్
### నెల వరకు కొత్త బుకింగ్ స్వీకరించలేమని చెబుతున్న ఏజెన్సీలు
### వాణిజ్య గ్యాస్ సరఫరాకు నోస్టాక్ బోర్డులు
### జిల్లాలో 60 శాతం మంది వంట గ్యాస్‌పైనే ఆధారం
### 3.50 లక్షల గ్యాస్ కనెక్షన్లు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం వల్ల వంట గ్యాస్ సరఫరాకు సంక్షోభం.. వంటింట్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో గ్యాస్ నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరో 15 రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్యాస్ కొరత తీవ్రరూపం దాల్చుతుందని డీలర్లు భిప్రాయపడుతున్నారు.

మొన్నటి దాకా బుక్ చేసిన రెండు రోజుల్లోనే ఇంటిముందు వాలే సిలిండర్.. ఇప్పుడు పది రోజులు గడిచినా అందడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఏర్పడింది. సరఫరాలో ఆటంకాలు ఎదుర వుతున్నాయి. ఇది వరకు బుకింగ్ చేసిన వారికి నాలుగైదు రోజుల తర్వాత రీఫిల్ సిలిండర్ ఇస్తామని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. కొత్తగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేందుకు వినియోగదారులు తంటాలు పడుతున్నారు. నాలుగు రోజుల క్రితమే గ్యాస్ ధరలు అమాంతంగా పెరిగాయి. వాణిజ్య సిలిండర్‌పై రూ.114, గృహ వినియోగ సిలిండర్‌పై రూ.60 పెంచేశారు. గ్యాస్‌పై ఆధారిత వినియోగదారులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వాణిజ్య గ్యాస్ సరఫరాపై ఆంక్షలు విధించారు. స్టాకు లేనందున సరఫరా చేయలేమని ఏజెన్సీలు చేతులెత్తేశాయి. గృహ వినియోగదారులు రీఫిల్ చేసుకునేందుకూ నెల రోజుల గడువు విధించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేందుకు ఐఈఆర్ఎస్ విధానంలో సాంకేతిక లోపం నెలకొన్నది. వినియోగదారులు ఎగబడి బుకింగ్ చేసుకోవడం వల్ల సాంకేతిక సమస్యల తలెత్తిందని అంటున్నారు. దానివల్ల ఆన్‌లైన్ విధానానికి తెర వేశారు. జిల్లాలో సుమారు 60 శాతం మంది వంట గ్యాస్‌పైనే ఆధారపడి ఉన్నారు. గతంలో కట్టెల పొయ్యి ద్వారా వంటకాలు తయారు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సుమారు 25 ఏళ్లుగా వంట గ్యాస్ సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా చాలామంది సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికారు. గిరిజన తండాలలో అక్కడక్కడ కట్టెల పొయ్యిలు వాడుతున్నారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాలలో దాదాపు అన్ని మండలాల్లోనూ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. జిల్లాలో 3.50 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు ఓ అంచనా. అందులో వెయ్యి వరకు వాణిజ్య కనెక్షన్లు ఉంటాయి. హోటళ్లు, వసతి గృహాలలో కమర్షియల్ గ్యాస్‌కు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత వారం రోజులుగా గ్యాస్ కొరత తలెత్తుతున్నా రెండు రోజులుగా తీవ్రత పెరిగింది. దాంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రీఫిల్ బుకింగ్ చేస్తే 24 గంటలల్లో సరఫరా చేసే ఏజెన్సీలు ఇప్పుడు ఐదారు రోజులు గడువు కావాలని అంటున్నారు. ఒక్కసారి బుకింగ్ చేస్తే మరో నెల రోజుల వరకు కొత్త బుకింగ్ స్వీకరించడం లేదని చెబుతున్నారు. యుద్ధ ప్రభావం వల్ల పరిస్థితి ఇలా ఉంటే విదేశీ ఎగుమతులు, దిగుమతులపై కూడా ప్రభావం చూపెడుతున్నదని వ్యాపారవర్గాలు అంటున్నాయి. పెట్రోలు, డీజిల్ కొరత కూడా తలెత్తవచ్చని ఆందోళన చెందుతున్నారు.

## అక్రమార్కులకు పంట!

### జనావాసాల మధ్య గ్యాస్ ఫిల్లింగ్ దందా
### పెద్ద సిలిండర్ నుంచి 5 చిన్న బుడ్లు ఫిల్లింగ్
### ఒక బండకు రూ. 2 వేల ఆదాయం

**ఇబ్రహీంపట్నం, మార్చి 12, ప్రభాతవార్త :** పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం వల్ల ఏర్పడిన వంట గ్యాస్ సంక్షోభం కొంతమంది అక్రమార్కులకు పంట పండిస్తోంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలను తుంగలో గ్యాస్ ఫిల్లింగ్ దందాకు తెరలేపారు. అత్యంత ప్రమాదకరమని తెలిసినా జనావాసాల మధ్య గ్యాస్ ఫిల్లింగ్ చేస్తుండటం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఒక్కో పెద్ద సిలిండర్ నుంచి సుమారు 4 నుంచి 5 చిన్న బుడ్లను నింపుతున్నారని తెలుస్తోంది. ఒక చిన్న సిలిండర్ రీఫిల్లింగ్‌కు రూ. 400 వసూలు చేస్తున్నారు. దీని ప్రకారం ఒక సిలిండర్‌పై రూ. 2వేలకు ఆర్జిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాల్సిన పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ విభాగం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. జనావాసాల మధ్య, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా రీఫిల్లింగ్ సాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గృహ వినియోగ గ్యాస్‌ను అక్రమంగా రీఫిల్లింగ్ చేయడం నేరమని తెలిసినా, సంబంధిత శాఖల నిస్తేజం వల్లే ఈ మాఫియా రెచ్చిపోతోందని ప్రజలు మండిపడుతున్నారు.

## ఎంపిటిసి నుంచే
# ఇక్కడి వరకూ వచ్చా

### కొత్త వాళ్లందరూ అవగాహన పెంచుకోవాలి
### సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత మీదే
### సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్‌ల శిక్షణా తరగతుల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్



సమావేశంలో పాల్గొన్న సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాలిక ఎంతగానో దోహదపడుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్ లకు శిక్షణ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో, దేశంలో పెద్ద స్థాయికి ఎదిగిన ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది సర్పంచ్ లుగా, కౌన్సిలర్లుగా రాజకీయ జీవితం ప్రారంభించిన వారేనని, తాను కూడా ఎంపీటీసీ గా రాజకీయ జీవితం ప్రారంభించి ఎంపీపీగా తదుపరి శాసనసభ్యునిగా,

మిగతా 2లో

## అడ్డగోలుగా.. బొక్కేస్తున్నారు



### అసైన్డ్ భూములను చెరపడుతున్న మట్టి మాఫియా
### ఆగడాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్

**మహేశ్వరం, మార్చి 12 ప్రభాతవార్త:** మహేశ్వరం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, గంగారం, ఉప్పుగడ్డ తండా, కొత్త తండాలలో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. రాత్రి పగలు తేడా లేకుండా జోరుగా మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చిన మట్టి మాఫియా అగడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. గత రెండు మూడు రోజుల నుండి నాగిరెడ్డిపల్లిలో జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటి అని ప్రజలు అసహనం వ్యక్తపరుస్తున్నారు. మట్టి వ్యాపారస్తులు అసైన్డ్ భూములను టార్గెట్ చేసుకొని మట్టిని అమ్ముకొని చలామణి అవుతున్నారు. మట్టి మాఫియాకు కొంతమంది రాజకీయ నాయకులు, ఇతరుల సహకారాలు ఉంటున్నాయని ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో పగలు, రాత్రి మట్టి దందా జరుగుతుంటే అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వ్యాపారస్తులు కొంతమంది నాయకులను మచ్చికగా చేసుకుంటూ మూడు పువ్వులు ఆరు కాయలుగా మట్టి వ్యాపారాలు

**అసైన్ భూములను తవ్వితే కేసులు నమోదు చేస్తాం: ఆర్డీవో**

మట్టిని అమ్మిన వారి పైన కొన్న వారి పైన అధికారులను పంపి సమగ్ర విచారణ జరిపి వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది. గుంతలు తీసిన భూములను స్వాధీనం చేసుకుంటాం. మట్టిని తరలిస్తున్న వారి వాహనాలను సీజ్ చేసి పిడి యాక్ట్ కేసులను నమోదు చేస్తాం.

కొనసాగిస్తున్నారు. ఈ వ్యాపారాలతో రోడ్లపై టిప్పర్లు తిరుగుతుండడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, రాత్రిపూట టిప్పర్లు ఎక్కువగా తిరుగుతుండడంతో నిద్ర లేకుండా చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసైన్డ్ భూములలో 20 ఫీట్ల మేరకు మట్టిని తవ్వుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. నాగిరెడ్డిపల్లిలో రైతులకు మిగతా భూములు కూడా ప్రభుత్వం

మిగతా 2లో

# ఉపాధి హామీలో అవినీతి మేత

### ప్రజా వేదికలో అక్రమార్కుల చిట్టా బట్టబయలు
### రూ.1.22 లక్షల రికవరీకి ఆదేశాలు
### తప్పు చేస్తే సహించేది లేదు
### కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎపిడి సరళ

**కొడంగల్, మార్చి 12 ప్రభాతవార్త :** వలసల నివారణతో పాటు స్థానికంగా ఉపాధి కల్పించాలనే సదుద్దేశ్యంతో అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకంలో కొడంగల్ మండలంలో అవి నీతి అక్రమాలు బట్టబయలైయ్యాయి. 2024- 25 సంవత్సరానికి సంభందించి ఉపాధిహామీ పనులపై ఈనెల 2 నుండి 11వ తేది వరకు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై సోషల్ అడిట్, గ్రామసభలు నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 15వ విడత ఉపాధి హామీ ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. కొడంగల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై వారం రోజుల పాటు సామాజిక తనిఖీలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో అధికారులు వివరాలు వెల్లడించారు. ప్రజా దర్బార్‌లో ఉపాధిహామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్లర్‌లపై సంభందిత అధికారులు రోల్ కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్లర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్లర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు లాంటి తప్పిదాలపై గ్రామాల్లో వివిధ స్థాయి ఉద్యోగులపై రూ.20వేల జరిమానాలతో పాటు రూ.1.32.369 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. అంగడిరైచూర్ గ్రామంలో అత్యధికంగా రూ.88వేల171 అవినీతి జరుగగా అత్యల్పంగా చిట్లపల్లిలో రూ.180 రికవరీకి ఆదేశించారు. సొంత గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఏపీడీ సరళ సూచించారు.



ప్రజా వేదికలో పాల్గొన్న కడా ప్రత్యేక అధికారి, ఎపిడి

ఉపాధిహామీ పథకంలో ఉపాధిహామీ పనుల్లో అవినీతిని ఉపేక్షించేది లేదని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఏపీడీ సరళ అన్నారు. కార్యక్రమాన్ని అధికారులు నామమాత్రంగా నిర్వహించడంతో పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడించలేదని ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. ఈ కార్య క్రమంలో విజిలెన్స్ అధికారి భార్గవి, అం బుడ్స్‌మెన్ రాములు, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఆడిట్ ప్రోగ్రాం మేనేజర్, ఎస్ఆర్పి కొమురయ్య, ఏపీఓ రాములు, ఈసీ సతీష్‌కుమార్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు కీలకం

### అర్హులకు అందేలా చూడాలి
### కలెక్టర్ మనుచౌదరి





మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా చూడాలని, సంబంధిత అధి కారులతో మున్సిపల్ నూతన చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు సమన్వయంగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సు జరిగింది. జిల్లా కలెక్టర్ మనుచౌదరితో పాటు మున్సిపల్ నూతన చైర్మన్లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఏర్పాటు చేసిన ఒక రోజు అవగాహన సదస్సును ప్రారంభించారు. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ చంద్రావతి, ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్,

మిగతా 2లో

## పర్యవేక్షణ లేక..
# ఇష్టారాజ్యం



పాషపూర్‌లో టీచర్ రాకపోవడంతో పట్టించుకునే వారు లేక ఖాళీగా కూర్చున్న చిన్నారులు

### పెద్దేముల్ మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి ఇదీ

### నాగులపల్లి -1లో ఇద్దరు పిల్లలు మాత్రమే హాజరు
### పాషపూర్ సెంటర్‌లో విధులకు డుమ్మా కొట్టిన టీచర్
### ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని స్థానికుల ఆవేదన
### మెమో జారీ చేస్తాం : సూపర్‌వైజర్

**పెద్దేముల్, మార్చి 12, ప్రభాతవార్త:** కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాన్ని నీరుకారుస్తోంది. పెద్దేముల్ మండలంలో 38 గ్రామ పంచాయతీలకు గాను 59 అంగన్‌వాడి సెంటర్లు ఉన్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇవి పని చేయాలి. ఆరు సంవత్సరాల లోపు పిల్లల పోషణను మెరుగుపరడచం, శారీరకంగాను, మానసికంగానూ ఉత్సాహంగా ఉండేలా చూడటం, గర్భిణీల, బాలింతల ఆరోగ్యం కాపాడడం, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఆటల ద్వారా ప్రీ స్కూల్ విద్య అందించడం, ఆరోగ్య పరిక్షలు, ఎదుగుదల, పిల్లల బరువు, చిన్నారులకు పౌష్టికాహారం ఇచ్చి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడం తదితర అంశాలపై సిబ్బంది దృష్టిపెట్టాలి.
అయితే పలుచోట్ల అంగన్‌వాడి టీచర్లు ఉదయం 10 గంటలు దాటినా సెంటర్లకు వెళ్ళడంలేదు. మరికొన్ని చోట్ల చిన్నారుల హాజరు అత్యల్పంగా ఉంటోంది. బుధవారం వార్త విలేకరి మండలంలో కొన్ని కేంద్రాలను సందర్శించగా అక్కడి నిర్లక్ష్య ధోరణి బట్టబయలు అయింది. పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి అంగన్‌వాడి కేంద్రం -1లో ఇద్దరు పిల్లలు మాత్రమే కనిపించారు. పాషపూర్ అంగన్‌వాడి సెంటర్‌లో టీచర్ అసలు విధులకే హాజరు కాలేదు. ఇష్టానుసారంగా అంగన్‌వాడి టీచర్లు వ్యవహరించడంతో పిల్లలు సక్రమంగా సెంటర్లకు రావడం లేదు. గ్రామంలో చిన్నారులను అంగన్‌వాడి కేంద్రానికి తీసుకొచ్చె బాధ్యత టీచర్లు, ఆయాలపై ఉంది. ఈ విషయంలో సిబ్బంది చొరవ చూపడంలేదని స్థానికులు చెబుతున్నారు. సంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం కూడా కనపిస్తోంది. దీంతో టీచర్లు, ఆయాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు నీరుగారిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
ఈ విషయంపై అంగన్‌వాడి సూపర్‌వైజర్ సునీతను వివరణను వివరణ కోరగా.. ఎటువంటి సమాచారం లేకుండా విధులకు హాజరు కాని పాషపూర్ టీచర్‌కు మెమో జారీ చేస్తామని చెప్పారు. ఎవరైన సరే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



నాగులపల్లి-1లో ఇద్దరు చిన్నారులే హాజరైన దృశ్యం

## అత్యవసర పనులకు చెల్లింపులు
# ఆగిపోతున్నాయ్

### రాజకీయ వైషమ్యాలతో అభివృద్ధికి ఆటంకం
### కొందరు ఉప సర్పంచులు చెక్కులపై సంతకం చేయకుండా పనులను అడ్డుకుంటున్నారు
### చెక్ పవర్‌ను రద్దు చేసి కార్యదర్శి, లేదా మండల అధికారికి అప్పగించాలి
### కలెక్టర్‌కు జిల్లా సర్పంచుల సంఘం ఫిర్యాదు

**కొత్తూరు, మార్చి 12, ప్రభాత వార్త:** గ్రామ పంచాయతీల్లో రాజకీయ విభేదాల కారణంగా అభివృద్ధి పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, కొత్తూరు మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఉప సర్పంచులకు ఉన్న ఉమ్మడి సంతకం అధికారం (చెక్ పవర్)ను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్ నారాయణరెడ్డికు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీల్లో నిధులు విడుదల కావాలంటే సర్పంచ్, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకం అవసరమని, అయితే క్షేత్రస్థాయిలో రాజకీయ వైషమ్యాల కారణంగా కొందరు ఉప సర్పంచులు చెక్కులపై సంతకం చేయకుండా అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీని వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి అత్యవసర పనులకు చెల్లింపులు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా అనేక గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. కొందరు రాజ కీయ ప్రయోజనాల కోసం సర్పంచులను ఒత్తిడికి గురిచేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు ఉప సర్పంచుల చెక్ పవర్ అధికారాన్ని రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా పంచాయతీ కార్యదర్శి లేదా సంబంధిత మండల అధికారికి ఆ బాధ్యత అప్పగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై ప్రభుత్వానికి ప్రత్యేక నివేదికను పంపించి అవసరమైతే చట్టంలో సవరణలు చేయాలని సర్పంచుల సంఘం తరఫున విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో రాజకీయాల కంటే అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ వినతిపత్రాన్ని సమర్పించినట్లు వారు పేర్కొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచుల సంఘం అధ్యక్షులు కొమ్ము కృష్ణ, మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్

## మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ : ఎమ్మెల్యే తలసాని



మోండా మార్కెట్‌లోని ఇస్లామియా మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట, మార్చి 12 ప్రభాతవార్త:** ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం రాత్రి మోండా డివిజన్‌లోని ఇస్లామియా మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపవాస రోజా దీక్షను విరమించిన ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షలు చేపడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో రంజాన్‌కు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడంతో పాటు రంజాన్ కిట్లను అందజేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, శివ యాదవ్, నాగులు, మహేష్ యాదవ్, మహేందర్, మజీద్ ఇస్లామియా కమిటీ అధ్యక్షులు అమీన్, ప్రతినిధులు సాబేర్ జానీ, అజ్మత్, జబ్బార్, నయీం పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

## అగ్నిప్రమాద బాధితులకు అండగా ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

**నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త:** ప్రగతి నగర్ కమాన్ వద్ద ఐడీపీఎల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఫర్నిచర్ షాప్ దుకాణదారుల సమస్యలను కేపీ వివేకానంద గౌడ్‌కి బీఆర్ఎస్ పార్టీ నాయకులు వివరించారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ ఎన్ఎంసి ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి ఎమ్మెల్యేను కలిసి బాధిత దుకాణదారుల ఆర్థిక పరిస్థితులను వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, బాధితులకు తగిన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జలగం చంద్రయ్య, నిరుడు యాదగిరి, అంజన్ కుమార్ యాదవ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు ఖలీల్ అహ్మద్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు

## 15న హనుమకొండలో 'హమాలీ మహాగర్జన సభ'

**సైఫాబాద్, మార్చి 12 ప్రభాతవార్త:** తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన హనుమకొండలో డిమాండ్ల సాధన కోసం 'హమాలీ మహా గర్జన సభ' నిర్వహిస్తున్నామని యూనియన్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఈ మహాగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.వి.శివకుమార్ తదిత రులు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పది నుంచి 20 లక్షల మంది హమాలీలు వివిధ జిల్లాల్లో పనిచేస్తున్నారని, ఇందు లో పది లక్షల మంది తమ యూనియన్‌లో సభ్యులుగా కొనసాగు తున్నారని చెప్పారు. మహారాష్ట్రలో తరహా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ మే హమాలీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశా రు. కార్మికులకు కనీస వేతనాలు, వేతనంతో కూడిన సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర డిమాండ్లను అమలు చేయాలని కోరారు. పై డిమాండ్లపై హమాలీ మహాగర్జన సభలో రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆపైన జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశం లో హరిబాబు, ఉగ్రం యాదవ్, రాములు, రాజు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న విజయారెడ్డి తదితరులు

## ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలు కేటాయించడం హర్షణీయం

**-ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి**

**హైదరాబాద్, మార్చి 12,ప్రభాతవార్త:** నిమ్స్ అభివృద్ధిలో భాగంగా ఎర్రమంజిల్‌లో ఇండ్లు కోల్పోయిన తొమ్మిది మందికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించడంపై ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే విజయారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలు అందరికీ అండగా నిలబడుతుందని అన్నారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాడు ఇండ్లు కోల్పోయిన తొమ్మిది మంది మహిళల తో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిమ్స్ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ ఎర్రమంజిల్ లోని కొంతమంది ఇండ్లను ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేశారని, అందులో తొమ్మిది మందికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్రమంజిల్ లోనే ఇండ్ల స్థలాలను కేటాయి స్తూ జి.ఒ విడుదల చేయడం హర్షణీయం అన్నారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశంగా ఇంట్లో పేషెంట్ ఉన్నా కూడా చూడకుండా కూల్చివేతలు చేశారని, అప్పటి నుండి తాము న్యాయ స్థానంలో ఇదే విషయమై పోరాటం చేస్తున్నామన్నారు.

## నేరాలను అరికట్టేందుకు సిసి కెమెరాలు ఎంతో మేలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట, మార్చి 12 ప్రభాతవార్త:** నేరాలు,ప్రమాదాలను, సంఘ విద్రోహ శక్తులను అరికట్టడంతో పాటు వారిని వెంటనే గుర్తించేందుకు సీసీటీవీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తన సొంత నిధులతో రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో రూ.2 లక్షల విలువ చేసే సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఒక సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. దొంగతనాలు, ప్రమాదాలు,దాడులు వంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సీసీకెమెరాల ద్వారా నిందితులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో సులువు ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు సంతోష్ యాదవ్ వంటి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదే విధంగా మోండా డివిజన్ వివిధ ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన వైష్ణవి యాదవ్,మోండా డివిజన్ అధ్యక్షులు ఆర్.డి.నాగేశ్ యాదవ్, బస్తీ నాయకులు డి.బాబూరావ్,రౌతు రాజయ్య, సాంబయ్య,యూత్ అధ్యక్షుడు పి.నర్సింగ్ రావ్, ఆశీర్వాదం ,శివ, రేపాల వెంకటేశ్వర్లు,అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.


రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సీసీటీవీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

## విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి గౌరవించాలి : శివబాలాజీ, అంజనీరాజన్

**నాంపల్లి, మార్చి 12 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో నిగూఢంగా దాగివున్న ప్రతిభను వెలికితీసి, గుర్తించి గౌరవిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని ప్రముఖ నటుడు, శివబాలాజీ, మెరిడియన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ డీన్ అంజనీరాజన్, మాస్టర్‌గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఇండియా వైస్‌ఛైర్మన్ డా. కొలను జగజీవన్‌రెడ్డి అన్నారు. కింగ్‌కోటి, బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ఘనంగా జరిగిన ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ (ఐబిఓ) జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరైన శివబాలాజీ, అంజలి రాజన్, జగజీవన్‌రెడ్డిలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థులను ఈ వేడుకల్లో ఘనంగా సన్మానించి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈయేడాది నిర్వహించిన మొదటిస్థాయి పరీక్షల్లో సుమారు 20లక్ష మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో అత్యంత ప్రతిభావంతులైన 2వేల మంది విద్యార్థులు జోనల్‌స్థాయి పరీక్షలకు అర్హత సాధించగా తుది పోటీలో జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయిల్లో టాపర్లుగా నిలిచిన 250మంది విద్యార్థులను పురస్కారాలతో గౌరవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ 2026-27 విద్యాసంవత్సరం పరీక్షా క్యాలెండర్‌ను అతిథుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో డా. పి.భువనేశ్వరి, డా.శ్రీపూజ సిద్ధమశెట్టి, సుహాసిని పాణ్యం, డా. కవిదేవ్, వి.పి. లతాప్రభాకర్, కావ్య, ప్రశాంతి, శంకర్, నయాన్, ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. విజేతలు అతిథుల చేతులమీదుగా విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు ప్రదానంచేసి శుభాకాంక్షలు అందజేశారు.


పురస్కారాలందుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులతో శివబాలాజీ, రామకృష్ణ, అంజలి, జగజీవన్‌రెడ్డి తదితర అతిథులు

## మహిళ బిల్లులో బిసిమహిళలకు సబ్ కోటా కేటాయించాలి : జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 12,ప్రభాతవార్త:** చట్టసభలలో అన్ని వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించే వరకు పోరాడి సాధించాలని, అప్పుడే మహిళా సాధికారత లభిస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్ లోని మొఘల్‌పుర డా విశ్వేశ్వరయ్య భవన్‌లో మహిళా దినోత్సవాన్ని బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి, బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టసభలలో మహిళలకు 33 రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల మహిళలకు అందులో సబ్ కోట కల్పించకపోవడం చాలా అన్యాయం అన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట లేకపోవడం మూలంగా మహిళా బిల్లు అమలు జరిగిన అగ్రకుల నాయకులు కుర్చీలలో వారి కుటుంబ సభ్యులు మాత్రమే మహిళా బిల్లు పేరుతో చట్టసభలోకి అడుగు పెడతారన్నారు. బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి. మని మంజరి, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ లు మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతూనే మీకు ఒక వైపు పోటీ ప్రపంచం పురుషులతో సమానంగా ఎదగడానికి సమాజంలో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని, ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాలలో మహిళా బిల్లుపై ప్రత్యేకంగా చర్చించి మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించాలని ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు లేకుంటే పార్లమెంట్ ముట్టడి చేపడతామని వారు హెచ్చరించారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 40 మంది మహిళ నేతలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ డాక్టర్ రమణ నాయక్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ గౌడ్, బీసీ మహిళ నేతలు రాధా రాణి, తారకేశ్వరి, జ్యోతి, సమతా యాదవ్, సంధ్యా రాణి, సుజాత, ఉమాదేవి, మీనా, సరిత, విజయ లక్ష్మి ౣ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



మహిళా నాయకులను సన్మానిస్తున్నజాజుల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మణిమంజరి, డాక్టర్ రమ తదితరులు

## కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని జలమండలి అధికారులకు వినతి

**నార్సింగి, మార్చి 12 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ డివిజన్ పరిధిలోని దర్గా కలిస్కాన్ ప్రాంతంలో సరఫరా అవుతున్న కలుషిత నీటిని అరికట్టాలని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ జల మండలి జీఏం జవహర్ అలీకి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా దర్గా కలిస్కాన్ ప్రాంతంలో మురుగునీరు మంచినీటి పైప్‌లైన్ లో కలిసి నల్లాల ద్వారా ఇళ్లకు సరఫరా అవుతుందన్నారు. ఇళ్లల్లో నల్లాల ద్వారా మంచినీటిని పట్టుకుంటున్న సమయంలో దుర్వాసన వస్తుందని, ఈ నీటిని తాగడానికి కాదుకదా కనీసం వాడుకునేందుకు కూడా వీలులేకుండా ఉందన్నారు. ఈ అపరిశుభ్రమైన నీటిని తాగి ప్రజలు అనారోగ్యం పాలయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జల మండలికి సకాలంలో ప్రజలు నీటి బిల్లులు చెల్లిస్తున్నా, నాణ్యమైన మంచినీటిని సరఫరా చేయడంలో అధికారులు అలసత్వం వహించడం మంచిది కాదన్నారు. వెంటనే జల మండలి అధికారులు స్పందించి ఈ కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని, శుద్ధమైన నీటిని ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. అధికారులు స్పందించకపోతే బాధిత ప్రజలందరిని పోగు చేసుకొని జల మండలి కార్యాలయం ముందు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తామని నీరుడు శేఖర్ ముదిరాజ్ హెచ్చరించారు. వినతిపత్రం అందుకున్న జిఎం జవహర్‌అలీ వెంటనే స్పందిస్తూ వెంటనే మంచినీటి పైప్‌లైన్‌లకు మరమ్మత్తులు చేయించి, శుద్ధమైన నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారని శేఖర్ ముదిరాజ్ తెలిపారు.


కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని జల మండలి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నేత నీరుడు శేఖర్ ముదిరాజ్.

## మరణించిన ఉపాధ్యాయ కుటుంబానికి రూ.6 లక్షల చెక్కు అందజేత

**నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త** ఒక్కరి కొరకు అందరం.. అందరి కొరకు ఒక్కరం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ కార్యక్రమం మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయు డిగా పనిచేస్తున్న కొండయ్య ఇటీవల జనవరిలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన టీఎస్ యుటిఎఫ్ నాయకుడిగా, ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ సభ్యుడిగా ఉండడంతో, టీఎస్ యు టిఎఫ్ మేడ్చల్ జిల్లా తరఫున ఆయన కుటుంబానికి రూ.6 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమం ఆయన పనిచేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జవహర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. అజం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి ,రాష్ట్ర నాయకులు మాణిక్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టీఎస్ యుటిఎఫ్ చేపట్టిన ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, కాప్రా మండల ఎంఈఓ నరసింహులు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే. జయసింహా రెడ్డి, ప్రధాన కార్యద ర్శులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండయ్య కుటుంబానికి చెక్కును అందజేస్తున్న దృశ్యం


రంజాన్ మాసం సందర్భంగా ఈద్ కా తోఫా పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మైనార్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి

**: హైదరాబాద్ డిసిసి అధ్యక్షులు ఖాలీద్ సైఫుల్లా**

**చార్మినార్,మార్చి 12 ప్రభాతవార్త :** మైనార్టీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైఫుల్లా అన్నారు.రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం తరుపున గురువారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం, బహుదూర్ పుర నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన మైనార్టీల కుటుంబాలకు ఈద్ కా తోఫాను ఆయన బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పులిపాటి రాహుల్‌తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా సయ్యద్ ఖాలీద్ సైఫుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని తెలిపారు.హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో ఈద్ కా తోఫా పంపిణీ జరిగిందని ఆయన తెలియజేశారు.బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పులిపాటి రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ మీడియా ఇంఛార్జిమహ్మద్ నసీర్,కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇక్బాల్,బానుచందర్ యాదవ్ పాల్గొన్నారు.

## మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

**-జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా**

**వికారాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని షీ టీమ్ ఆధ్వర్యంలో స్థానిక మహావీర్ మెడికల్ కలేజీలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉన్నప్పుడే శక్తివంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి మహిళా తన హక్కులపై, తమ రక్షణ కోసం ఉన్న చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ముఖ్యంగా ఈవ్ టీజింగ్, సైబర్ వేధింపుల నివారణకు షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతాయని స్పష్టం చేశారు. ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా తక్షణమే డైల్ 100 లేదా షీ టీమ్ నంబర్లకు సమాచారం అందించాలని, బాధితుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆమె భరోసా ఇచ్చారు. సమాజంలో మహిళలు, పిల్లలు, వృద్ధులపై జరిగే ఎలాంటి వేధింపులనైనా సహించబోమని, అన్యాయం జరిగినట్లు తమ దృష్టికి వస్తే బాధ్యతాయుతంగా స్పందిస్తామని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్పీ విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం అనన్య, జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి రేణుకా దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి స్వర్ణలత, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, మహిళా పిఎస్ ఇన్‌స్పెక్టర్ సరోజ, మహావీర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దురక్రమణ దాడులపై ఖండన

**సైఫాబాద్, మార్చి 12 ప్రభాతవార్త:** గత కొన్ని రోజులుగా అమెరికా, ఇజ్రాయెల్ విస్తరణ కాంక్షతో ఇరాన్‌పై జరుపుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణ దాడులను సిపిఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడి పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇరాన్‌పై అమెరి కా, ఇజ్రాయెల్ అధిపత్య దుక్రమణ దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 23న ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజాన్ని, న్యాయ సూత్రాలను ఉల్లంఘించి ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్ష దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని, తక్షణమే ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మల్లెపలి ప్రభాకర్, సంపంగి పద్మ, చిట్టిబాబులను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. చంద్రపుల్లారెడ్డి పార్టీ పేరుతో వారు ఏలాంటి ప్రకటనలు జారీ చేసిన సహిం చేది లేదని హెచ్చరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న షేక్ షావలి, సునీత, సంతోష్‌నాయక్, కళక్క తదితరులు


టీకే శ్రీదేవితో మున్సిపల్ వైస్ చైర్మన్ తదితరులు

## ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త :** మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ టికే శ్రీదేవితో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, కౌన్సిలర్లు రాజు నాయక్, నడికుడ శ్రావణి, కళ్యాణ్ కార్ దిలీప్ తదితరులు కలుసుకున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్థానిక ప్రజాప్రతినిధుల శిక్షణ తరగతుల సందర్భంగా ఆమె కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ పాలకవర్గం సభ్యులు ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు మంచి సేవలు అందించాలని టికే శ్రీదేవి కోరారు.

## అడ్డగోలుగా బొక్కేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునే అవకాశం ఉందంటూ వారికి నమ్మబలికి నయానో భయానో ముట్టజెప్పి మట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని రైతులు అంటున్నారు. మండలంలో ఇంత పెద్ద మొత్తంలో మట్టి దందా నడుపుతుంటే అధికారులు, పోలీసులు ఎందుకు మోనం వహిస్తున్నారని ప్రజలు అగ్రహం వ్యక్తపరుస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లనే మట్టి వ్యాపారస్తులు రెచ్చిపోతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దర్జాగా మట్టి దందాను నడిపే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకొని మన ప్రాంత వనరులను కాపాడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## సంక్షేమ పథకాలు కీలకం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్ నూతన చైర్మన్లు కంఠం శిరీషకృష్ణారెడ్డి, జామ్ రవి, లావుడ్య శ్రీదేవిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని ఈ నెల 6వ తేదీన ప్రారంభించినట్లు, జూన్ 12వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. దీన్ని ఐదు స్థాయిలలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో చేపట్టె 10అంశాల గురించి వివరించారు. ప్రజా సంక్షేమ పథకాలు కీలకమని, వాటికి అర్హులైన వారి ఎంపికలకు సంబంధించి అధికారులు వివరించటం జరుగుతుందన్నారు. 99రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పది అంశాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి దీనిలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో అవగాహణ పొందటానికి ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఏమైనా సందేహాలు ఉన్నా అధికారుల దృష్టికి తేవాలన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, పారిశుద్యం, మహిళా, యువత సంక్షేమం, పర్యావరణం, పరిసరాల పరిశుభ్రత, పోలీసు, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసి, డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రత పలు అంశాలపై ఈ సదస్సులో వివరించటం జరిగిందన్నారు. అడవులలో వ్యర్థపదార్థాలు వేయకుండ అడవులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మొక్కలను నాటుతూ ప్రకృతిని కాపాడాలని అటవీశాఖ అధికారులు సూచించటం జరిగింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ మనుచౌదరి పిలుపు నిచ్చారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులకు మున్సిపల్ పాలనకు సంబంధించి విధి విధానాలను సంబంధిత అధికారి వివరించారు.

## ఎంపిటిసి నుంచే ఇక్కడి వరకూ వచ్చా

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిగా, ఇప్పుడు రాష్ట్రంలో శాసన వ్యవస్థలో అత్యంత ఉన్నతమైన అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉన్నానని అన్నారు. కింది స్థాయి నుండి వచ్చిన ప్రజాప్రతినిధులకు సామాజిక అంశాలు, పేదలకు అందించాల్సిన సేవలపై ఎక్కువ అవగాహన ఉంటుందని ఆయన తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులపై ఉంటుందని, ఇక్కడ ఎన్నికైన సర్పంచ్‌లు, చైర్మన్లు, కౌన్సిలర్లలో ఎక్కువ మంది కొత్తవారే కాబట్టి ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మీ విధులు, మీరు చేయవలసిన పనులపై మీకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని అన్నారు. ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు రెండు కళ్ళు లాంటి వారని, కలిసికట్టుగా పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పథకాలు సమర్ధవంతంగా ప్రజలకు అందాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని స్పీకర్ సూచించారు. వేలు, లక్షల మందిలో ఒక్కరికి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం వస్తుంది, మీకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల మనసులో నాటుకుపోయే విదంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు, మిగిలిన సమయంలో అందరూ కలిసి సమిష్టిగా గ్రామాలను, వార్డులను అభివృద్ధి చేసుకోవాలని అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించాలని తెలిపారు. వికారాబాద్ జిల్లా నుండి ముఖ్యమంత్రి, స్పీకర్ వంటి ఉన్నత స్థానాలలో ఉన్నామని నిధులు మంజూరు చేయించే బాధ్యత తమదని సమర్ధవంతంగా ఖర్చు చేసే బాధ్యత ప్రజా ప్రతినిధులదని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రనిధుల భాగస్వామ్యం, సహకారం అవసర మన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేవిధంగా కృషి చేస్తామన్నారు. గ్రామ సభల్లో ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరించబడతాయని కలెక్టర్ తెలిపారు. తాండూర్ శాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. 99 రోజులుగా నిర్వహించే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకదృష్టి సారించా లన్నారు. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్ఓ మంగిలాల్, ఆర్డీవో వాసుచంద్ర, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లు గడ్డం అనన్య, పట్లోళ్ల నీరజ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## 14న రౌండ్ టేబుల్ సమావేశం

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ సమైక్య ఆధ్వర్యంలో 14 మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల వీరోచిత పోరాటం, అమరుల త్యాగ ఫలితంగా ఏర్పడిన తెలంగాణాలో నేటికి ఉద్యమ కారులకు సరైన గౌరవం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల అమలుపై కోడా నేటికి సరైన ప్రణాళిక లేదని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో హామీల అమలుకై కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, లేని పక్షంలో తెలంగాణ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్ దేశాయ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.. తెలంగాణ సమాఖ్యలో విద్యావంతులు, న్యాయ నిపుణులు, సీనియర్ జర్నలిస్టులు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు భాగస్వామ్యంగా, రౌండ్‌టేబుల్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ఉద్యమకారుల సంక్షేమంపై చర్చించనున్నట్లు తెలిపారు.



వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు

## ప్రాణాలను కాపాడే గొప్పసేవ రక్తదానం

**అగ్రికల్చరల్ కళాశాల డీన్ నారాయణ రెడ్డి**

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12,(ప్రభాత వార్త):** పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 50మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ నారాయణ రెడ్డి పాల్గొని రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణాలను కాపాడే గొప్పసేవయని అన్నారు. ఇది విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమమని అన్నారు. ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ జూబ్లీహిల్స్ వైటల్ సహకారంతో రక్తదాన శిబిర విజయవంతంగా నిర్వహించబడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ డీన్ రఫత్ రజియా, ప్రిన్సిపాల్ ఉపాలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సి. మల్లేశ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 7 ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. దివాకర్ రెడ్డి, అధ్యాపకులు శ్రీధర్,కమల, ఎన్‌సీసీ ఆఫీసర్ బి. సారస్, ఆరాధ్య బ్లడ్ బ్యాంకు ప్రతినిధి రత్నం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేత

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12, (ప్రభాత వార్త):** పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లికి చెందిన మోటుపల్లి సాయమ్మ మృతి చెందగా గురువారం స్థానిక బీఆర్ఎస్ యువ నాయకుడు అబ్బవతి నర్సింహ మృతురాలి కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. మృతురాలి కుటుంబీకులు కడు బీద వారు కావడంతో సాయమ్మ దహన సంస్కార నిమిత్తం కుటుంబ సభ్యులకు ఆర్థికసహాయం అందజేసినట్లు తెలిపారు. ఆర్థిక సహాయం అందజేసిన అబ్బవతి నర్సింహ మాజీ కౌన్సిలర్ అబ్బవతి సరిత బంధువు కావడం గమనార్హం.



నారపల్లిలో మృతురాలు సాయమ్మ దహన సంస్కార నిమిత్తం రూ.20 వేలుఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ యువనాయకుడు అబ్బవతి నర్సింహ తదితరులు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచులు

## స్పీకర్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

**ధారూర్, మార్చి 12, ప్రభాత వార్త:** వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం కొనసాగుతోంది. గురువారం ధారూర్ మండల కేంద్రంలో ఎస్ ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో ధారూర్ మండలానికి చెందిన పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అల్లాపూర్ సర్పంచ్ మంతి విజయలక్ష్మి కృ, హరిదాస్ పల్లి సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, లక్ష్మీ నగర్ తాండా సర్పంచ్ కేతావత్ పూజా తమ అనుచరులతో కలిసి హస్తం గూటికి చేరారు. వీరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్ సింగ్, ఏఎంసీ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, పిఏసిఎస్ మాజీ చైర్మన్ హనుమంత రెడ్డి, ఇతర సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన స్వతంత్ర సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పెద్ద ఎత్తున పార్టీలో చేరడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పనితీరుకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. ఈ భారీ చేరికలతో ధారూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని, రాబోయే రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి అంతా కలిసికట్టుగా పనిచేస్తామని నాయకులు స్పష్టం చేశారు.



హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

## మంచినీటి సమస్యను పరిష్కరించండి

**బీఆర్ఎస్ నాయకుల వినతి**

**మేడ్చల్, మార్చి 12, ప్రభాతవార్త:** మేడ్చల్ పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించి వెంటనే నీటి సరఫరా చేయాలని, మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించాలని కోరుతూ హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి మేనేజింగ్ డైరెక్టర్ కె అశోక్‌రెడ్డికి మేడ్చల్ బీఆర్ఎస్ నేతలు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన లెటర్ ప్యాడ్‌పై రాసిన వినతి పత్రాన్ని నాయకులు తీసుకెళ్లి మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి అందించారు. మేడ్చల్ పట్టణ ప్రజలకు మంచినీటి సమస్యను పరిష్కరించాలని, డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ భాస్కర్ యాదవ్, మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు నవీన్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు పి.ఎం కిసాన్ 22 విడత అవిష్కరణ

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 12,(ప్రభాతవార్త):** పిఎం కిసాన్ 22వ విడత ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి తెలిపారు. కొందుర్గు మండలంలోని ఆగిరాల,కొందుర్గు, ముట్పూర్,మహాదేవపూర్, జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల,ఎదిర చౌదరిగూడలోని గల రైతువేదికలలో సాయంత్రం ఐదు గంటలకు వీడియో కాన్ఫరెన్స్ తిలకించుటకు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ సభ్యులు, అధికారులు తమకు అందుబాటులో ఉన్న రైతు వేదికల్లో జరిగే కార్యక్రమాలను తిలకించాలని ఆయన కోరారు.

# ప్రజాప్రతినిధులు-అధికారులు కలిసి పనిచేస్తేనే పేదల అభివృద్ధి

**రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి12, ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని తెలిపారు. ప్రజలతో మమేకమై పనిచేస్తేనే వారి మన్ననలు పొందగలమని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని, వాటిని గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ చదువుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు పట్టణాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మున్సిపాలిటీల నిర్వహణను సక్రమంగా చేయాలని తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలను పర్యవేక్షించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని చెప్పారు. అభివృద్ధితో పాటు రోడ్డు భద్రత, యువత మత్తుపదార్థాల బారిన పడకుండా చూడడం వంటి సామాజిక అంశాలపై కూడా దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లకు అవగాహన కల్పించడం సంతోషకరమని అన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుతూ ప్రజల కోసం పని చేయాలని, ప్రజాక్షేత్రంలో ఉండాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, కౌన్సిలర్లు కృషి చేయాలని కోరారు. జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయని తెలిపారు. సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అధికారులు-ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజలకు అవసరమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను షెడ్యూల్ ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియోల ద్వారా మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా కూరగాయల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న కోదండరెడ్డి

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా పరికరాల పంపిణీ

**- ఉత్తమ ప్రతిభకు నగదు బహుమతుల ప్రకటన**

**మాడ్గుల, మార్చి 11,ప్రభాత వార్త :** పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించేందుకు మాడ్గుల మండలంలోని పాఠశాలల్లో పరీక్షా పరికరాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి రేఖ విజ్ఞప్తి మేరకు మాడ్గుల ప్రభుత్వపాఠశాల నుండి పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న 43 మంది విద్యార్థులకు మన్న విష్ణు పరీక్షా పలకలు, ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాడ్గుల గ్రామ ఉప సర్పంచ్ సూదిని శరత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మండలంలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.10వేలు, రెండవ స్థానం సాధించిన విద్యార్థికి రూ.5వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని ప్రకటించారు. విద్యార్థులకు వెంటనే సహాయం చేసిన మన్న విష్ణుకు ఉప సర్పంచ్ శరత్ రెడ్డి, రేఖలు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు లవ్ కుమార్, కొనాపురం రాజు, కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆర్కపల్లిలో...**

ఆర్కపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా పలకలు, పెన్నులు, పెన్సిల్లును వార్డు సభ్యులు యాచారపు అరవింద్ పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులైన 2013-14 సంవత్సరపు బృందం (వందేమాతరం స్ఫూర్తి) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు విజయవంతంగా రాసి అత్యధిక మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి గ్రామానికి, తాము చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మితిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ తోలు రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్ష పరికరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

# యాక్టివాను ఢీకొట్టిన డిసిఎం కంటైనర్

**తృటిలో తప్పిన ప్రమాదం**

**ప్రాణాపాయం నుండి బయటపడ్డ తల్లి కూతురు**

**నందిగామ, మార్చి 12, ప్రభాతవార్త:** నందిగామ మండలం తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం సాయంత్రం స్కూటీని డిసిఎం కంటైనర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు తల్లి కూతురు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని ఇంటర్ పరీక్షలు ముగించుకొని తన తల్లితో స్కూటీపై షాద్ నగర్ వైపు వస్తుండగా ముందు వెళ్తున్న డిసిఎం కంటైనర్ నందిగామ తహసిల్దార్ కార్యాలయం ముందు అకస్మాత్తుగా బ్రేక్‌వేసి మలిపాడు. అదే దారిలో వెనక నుండి స్కూటీపై వస్తున్న తల్లి కూతురు స్కూటీతో అదుపుతప్పి డిసిఎం ట్రైలర్‌కింద పడ్డారు. గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనాన్ని నిలిపేశారు. ఈ సంఘటనను చూసిన అక్కడున్న వారు కింద పడి ఉన్న తల్లి కూతుళ్లను, స్కూటీని బయటికి లాగారు. ఈ ప్రమాదంలో ఇరువురికి చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు తర్యాప్తు జరుపుతున్నారు.



నందిగామలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన డిసిఎం కంటైనర్





స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డ తల్లి కూతురు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ..

**చేవెళ్ల, మార్చి12, ప్రభాతవార్త :** రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి ఊరడి రాంప్రసాద్ ఆకాంక్షించారు. చేవెళ్ల మున్సిపల్ ఊరెళ్ళ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ... ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తేజపరిచారు. ఈ సహకారం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ అక్బర్, కృష్ణ, ప్రకాశ్ రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు అందజేసిన దృశ్యం



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

**చేవెళ్ల, మార్చి, ప్రభాతవార్త :** అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల అగ్నిమాపక ఎస్ఎఫ్ఓ రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని పామెన శివారులో ఉన్న సంస్కృతి పాఠశాలలో విద్యార్థులు, సిబ్బందికి అగ్నిమాపక భద్రతపై అవగాహన కల్పించేందుకు ఫైర్ సేఫ్టీ అవేర్‌నెస్ డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్షణం ఎలా స్పందించాలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు వివరించారు. మంటలు చెలరేగిన సమయంలో వాటిని ఎలా అదుపులోకి తేవాలో ప్రదర్శనతో చూపించి, విద్యార్థుల చేత కూడా ఆచరణలో చేయించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అధైర్య పడకుండా కారణం తెలుసుకుని ఫైర్ స్టేషను సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని వీటి నివారణకు ప్రజలు ముందుస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండే వస్తువులు ఉంటే వాటిని ప్రమాద స్థలం నుంచి దూరం చేయాలని చెప్పారు. సాధ్యమైనంత వరకు మంటలార్పే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని హెడ్ కానిస్టేబుల్ దస్తగిరి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, గోపాల్, నరసింహ, శివకుమార్ నిర్వహించి విద్యార్థులకు ఉపయోగకరమైన భద్రతా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఏ. శశిపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రేహానా పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు

## సొంత ఇంటికల నెరవేరుతుంది

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 12,(ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద ప్రజలకు సొంత ఇంటికళ నెరవేరుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలో చాకలి కరుణావతికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. గ్రామంలోని పేద ప్రజలందరికి ప్రభుత్వపథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, చెన్నయ్య, లక్ష్మణ్, అశోక్, వాసు, శ్రీను, బాలు, శివరాజ్, శంకర్, నర్సింహులు, వెంకటదాసు, లింగం, యాదయ్య తదితరులు ఉన్నారు.

## గ్రామ ప్రజలకు అండగా సర్పంచ్ భాగ్యలక్ష్మి

**మాడ్గుల, మార్చి 12, ప్రభాత వార్త:** గ్రామ ప్రజలకు అండగా నిలుస్తున్నారు సర్పంచ్ భాగ్యలక్ష్మితిరుపతిరెడ్డి. గ్రామంలో ఇటీవల మరణించిన మొకురాల నారయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.6వేలు ఆర్థిక సహాయం అంద జేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. అలాగే గ్రామానికి చెందిన సీత బిక్కయ్య కుమార్తె అల్లుడు నెలరోజులక్రితం ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆటోబోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసు కున్న సర్పంచ్ దంపతులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోలు రవీందర్, వార్డు సభ్యుడు బండ శ్రీశైలం, మురుపోజు లక్ష్మణాచారి, సభ్యురాలు మోగిళ్ల ప్రేమలత బిక్కు, సభ్యురాలు ఆదిమల్ల సుహాసిని శివతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మితిర్పతిరెడ్డి

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్

**కొడంగల్, మార్చి 12ప్రభాతవార్త:** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్‌లో ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో అలరించారు. స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా శిరిష, ఉపాధ్యాయులుగా భరత్‌కుమార్ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణంరాజు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వేణుగోపాలన, ఉపాధ్యాయులు ఎం.జయభారితి, పాఠశాల కమిటీ చైర్మేన్ అనంతమ్మతో పాటు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**చేవెళ్ల, మార్చి, ప్రభాతవార్త :**

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆలూర్ పశువైద్యాధికారి డాక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని రామన్నగూడ వార్డు, మండల పరిధిలోని గొల్లగూడ గ్రామంలో గురువారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వెయ్యాలన్నారు. నట్టల నివారణ మందులు చూడి పరీక్షలు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు గర్భ కోశ వ్యాధి చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది వెంకటయ్య, శ్రీనివాస్, సీహెచ్ శ్రీధర్ రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **Mr. Chengal Hari Krishna Reddy,** S/o. Mr. Chengal Govardhan Reddy, aged about 30 years, R/o.2-10, Shankarpalli, Singapur, K.V.Ranga Reddy District, Telangana-501203, is the owner of the Plot NO.18, in survey No.310/A & 310/B, situated at Singapur Village, Shankarpalli Mandal, K.V. Ranga Reddy, having acquired the same vide Regd. Sale Deed Nos. 11714/2019, dt. 29.10.2019. My client submits that while travelling by bike from his residence to Shankarpally to Chevella, my client lost the cover carrying original link document No. 1290/1990 dt. 09.08.1990 registered as SRO Chevella, pertinent to Mr. Katta Somalingam, and has lodged a complaint with Police Station Shankarpally.

If any person/persons, has/have found the missing document No. 1290/1990 and deals with the above said property in lieu of the lost of original link document or finds/has found the said documents the same may be returned or informed to the undersigned within 7 days from the date of this publication.

**Mr. Aila Komaraiah**
**Advocate**
# Flat No.407, Kalyanplaza Apartment
Rukminipuri Colony, Sharada Bustop
A.S. Rao Nagar, Kapra-500062,
Medchal-Malkajgiri District,
Telangana, **Mobile: 9849463287**

**THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-cum-VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL**
**O.S.NO. 73 OF 2026**

Between:
**Valluri Vibhishan Rao & 3 Others ...PLAINTIFFS**
AND
**The Tahsildar & others ...DEFENDANTS**

To,
**All Concerned,**

Please take notice that the Plaintiffs has filed the above suit for Declaration as the Plaintiffs are the only legal heirs of the late Valluri Laxmi, W/o. Valluri Vibhishan Rao who was the original owner of the suit schedule properties i.e. (A) House No. D.P (EWS)-66 bearing Municipal Door No.22-247 with a plinth area of 14.24 Sq.Mtrs. situated in Housing Complex at IDA, Jeedimetla, Hyderabad in Sy. Nos. 261 & 262 part of Jeedimetla Village, Qutubullapur Mandal, Ranga Reddy District (now in Medchal-Malkajgiri District), and bounded by: North: House No. DP-65, South: Path-way, East: Path-way, West: House No. D.P-53, (B) House No. D.P (EWS)-65 bearing Municipal Door No. 22-271 with a plinth area of 14.24 Sq.Mtrs. situated in Housing Complex at IDA, Jeedimetla, Hyderabad in Sy. Nos. 261 & 262 part of Jeedimetla Village, Qutubullapur Mandal, Ranga Reddy District (now in Medchal-Malkajgiri District), and bounded by: North: House No. DP-64, South: House No. DP-66, East : Path-way, West: House No. D.P-54, and (C) House No. D.P (EWS)-37 bearing Municipal Door No. 22-243 with a plinth area of 155.0 Sq.fts. situated in Housing Complex at IDA, Jeedimetla (APIIC Colony) of Jeedimetla Village, under Qutubullapur Municipality & Mandal Qutubullapur, Medchal Sub-District, Ranga Reddy District (now in Medchal-Malkajgiri District), and bounded by: North : Path-way, South: House No. EWS-46 (DP), East: House No. EWS-36 (DP), West: House No. EWS-38 (DP). If any person or persons having any objection or claims they may appear on 06/04/2026 at 10.30 a.m. either in person or through an advocate, failing which the matter will be decided basing on the documents available on record. Hence this notice.

// BY ORDER OF THE COURT//

**M/s. M. RAMU,**
**N. PRABHAKAR, Advocates,**
Flat No.302, Gayathri Homes, Kamala Nagar, Kothapet, R.R. District-35. **9985717160**

**బహిరంగ ప్రకటన**

ప్రజలందరికీ సాధారణంగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ డా. యెద్దుల గంగాధర్ రెడ్డి గారు, తండ్రి పేరు Y పుల్లా రెడ్డి, వయస్సు సుమారు 38 సంవత్సరాలు, నివాసం: H.No. P-102, రాజాపాంత రెసిడెన్సీ, సాగర్ హిల్స్ రోడ్ నం.7, నక్షత్ర హాస్పిటల్ సమీపంలో, వారిపురి కాలనీ, టట్టి అన్నారం, కె.వి. రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 500068, ఆధార్ నం: 3984 1212 1908. వేరువేరు యజమానులు మరియు భూస్వాములు అయిన క్రింది వ్యక్తులు తమ వ్యవసాయ భూమిని విక్రయించడానికి చేసిన ఆఫర్‌ను నా క్లయింట్ అంగీకరించారు. 1. శ్రీమతి పాశం కవిత, భర్త: పాశం కృష్ణ గౌడ్, వయస్సు సుమారు 50 సంవత్సరాలు, వృత్తి: గృహిణి. 2. శ్రీ పాశం కృష్ణ గౌడ్, తండ్రి: పి. నరసింహ, వయస్సు సుమారు 50 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం. పై ఇద్దరూ నివాసం: H.No. 4-89, మంకల్ గ్రామం, తుక్కుగూడ మున్సిపాలిటీ, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501359. 3. శ్రీమతి వందాల అశ్విని గౌడ్, భర్త: అమరగాని సురేష్ కుమార్, తండ్రి: వేందాల శంకర్ గౌడ్, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: H.No. 5-5-138/6/5, ముస్తఫా నగర్, ఖమ్మం జిల్లా, తెలంగాణ - 507001.

పై పేర్కొన్న వ్యక్తులు క్రింద ఇవ్వబడిన షెడ్యూల్‌లో వివరించిన వ్యవసాయ భూమిని సరైన అమ్మకపు విలువకు విక్రయించడానికి అంగీకరించగా, నా క్లయింట్ వారి ఆఫర్‌ను అంగీకరించారు. అందుకు అనుగుణంగా, పై వ్యక్తులు నా క్లయింట్ అనుకూలంగా క్రింది షెడ్యూల్‌లో పేర్కొన్న భూమికి సంబంధించి advance amount (బయానా సొమ్ము)ను ఇచ్చినారు. మొత్తం అమ్మకపు మొత్తంలో కొంత భాగాన్ని నా క్లయింట్ నుండి స్వీకరించారు. మిగిలిన అమ్మకపు మొత్తం agreement of sale (అమ్మకపు ఒప్పందం)లేదా రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించబడును.

అమ్మకపు ఒప్పందం అమలులో ఉన్న సమయంలో, పై విక్రేతలు మిగిలిన మొత్తాన్ని స్వీకరించి, షెడ్యూల్‌లో పేర్కొన్న వ్యవసాయ భూమిని నా క్లయింట్ లేదా ఆయన నామినీ పేరున రిజిస్ట్రేషన్ చేయడానికి అంగీకరించారు. అందువలన, షెడ్యూల్‌లో పేర్కొన్న భూమిని నా క్లయింట్ లేదా ఆయన నామినీ పేరున రిజిస్ట్రేషన్ చేయడంపై ఎవరికైనా అభ్యంతరం ఉన్నట్లయితే, ఈ నోటీసు ప్రచురితమైన తేదీ నుండి 7 రోజులలోపు తగిన ఆధార పత్రాలతో క్రింది చిరునామాకు తెలియజేయవలెను. లేనిపోతే, ఎవరికీ అభ్యంతరం లేనట్లుగా పరిగణించి, నా క్లయింట్ మిగిలిన అమ్మకపు మొత్తాన్ని చెల్లించి, క్రింద పేర్కొన్న షెడ్యూల్ భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకొనును.

(ఈ నోటీసు నా క్లయింట్ సూచనల మేరకు జారీ చేయబడింది)

షెడ్యూల్ - ప్రాపర్టీ 1 శ్రీమతి పాశం కవిత, భర్త: పాశం కృష్ణ గౌడ్ పేరులో : గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామం మరియు గ్రామపంచాయతీ, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం పరిధిలో ఉన్న క్రింది వ్యవసాయ భూమి:Sy.No. 80/ఆ/2 - విస్తీర్ణం Ac 0.29 గుంటలు, Sy.No. 81/ఈ/2, Ac 0.31 గుంటలు, Sy.No. 82/ఆ/1/1/1, Ac 0.0200 గుంటలు, Sy.No. 82/ఆ/1/2/2, Ac 0.0700 గుంటలు, Sy.No. 82/ఆ/1/3/2, Ac 0.0650 గుంటలు, Sy.No. 82/ఆ/2/1/1, Ac 0.0200 గుంటలు, Sy.No. 82/ఆ/1/1, Ac 0.0400 గుంటలు, Sy.No. 82/ఇ, Ac 0.1700 గుంటలు, Sy.No. 82/ఇ/2/1/1, Ac 0.0350 గుంటలు, Sy.No. 82/ఇ/3, Ac 0.1700 గుంటలు మరియు Sy.No. 82/ఈ/1, Ac 0.1400 గుంటలు, Sy.No. 82/ఈ/2, Ac 0.1400 గుంటలు, Sy.No. 82/ఈ/4, Ac 0.1600 గుంటలు and Sy.No. 82/ఉ, Ac 0.1900 గుంటలు, Sy.No. 82/ఈ/1, Ac 0.0200 గుంటలు, మరియు Sy.No. 82/ఈ/2, Ac 0.1700 గుంటలు Sy.No. 82/ఎ/2, Ac 0.3900 గుంటలు మొత్తం విస్తీర్ణం: Ac 6.00 గుంటలు.

షెడ్యూల్ - ప్రాపర్టీ 2 శ్రీ పాశం కృష్ణ గౌడ్ పేరులో గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామం మరియు గ్రామపంచాయతీ, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం పరిధిలో ఉన్న వ్యవసాయ భూమి:Sy.No. 83/ఇ, Ac 5.00 గుంటలు, Sy.No. 83/ఇ/3, Ac 0.32 గుంటలు మరియు Sy.No. 84/ఇ1/1/1/2, Ac 0.0206 గుంటలు మొత్తం విస్తీర్ణం: Ac 5.3406 గుంటలు.

షెడ్యూల్ - ప్రాపర్టీ 3 శ్రీమతి వందాల అశ్విని గౌడ్, భర్త: అమరగాని సురేష్ కుమార్ పేరులో గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామం మరియు గ్రామపంచాయతీ, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం పరిధిలో ఉన్న వ్యవసాయ భూమి Sy.No. 84/ఇ1/1/2/2, Ac 0.1900 గుంటలు, మరియు Sy.No. 83/ఇ/4/2, Ac 0.0100 గుంటలు మొత్తం విస్తీర్ణం: Ac 0.20 గుంటలు.

M/s/.RAPOLU BHASKAR
RAPOLU ABHINAV-IRSADLA NAGRAJ
ADVOCATES
HIGH COURT OF TELANGANA
# H.No.16-2-740/7, Plot No.7,
Gaddiannaram Road, Kalyan Nagar Road No.1,
Dilsuknagar, Hyderabad, Pin Code - 500060.
Cell No.9394642029, 9848498029.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

## రైతులు మట్టి నమూనా పరీక్షలతో ఎరువులు వాడాలి

పిఆర్ఐడిపి శాస్త్రవేత్త గోపాలకృష్ణారెడ్డి

**మొయినాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** రైతులు మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని పరీక్షలను బట్టి ఎరువులు వాడితే భూసారం సస్యశ్యామలంగా ఉంటూ అధిక దిగుబడి వంటలు పొందవచ్చునని పిఆర్ఐడిపి శాస్త్రవేత్త ఏ.గోపాలకృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డిలు అన్నారు. గురువారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో సంయుక్తంగా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ ముయినాబాద్ మండలంలో గ్రామాలలో రైతులు అధికంగా కూరగాయల వంటలతో పాటు పూలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇందుకు గాను మట్టి నమూనా పరీక్షలు చేయించుకొని భూమి అవసరాలకు అనుగుణంగా ఎరువులు వాడితే వంటలు అధిక దిగుబడి పొందవచ్చునని అన్నారు. ముఖ్యంగా కూరగాయల వంటల్లో మంచి ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కలుపు మొక్కలు తగ్గడం, నీటి వాడకం తగ్గడం, వంట దిగుబడి పెరగడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో రైతులు వరితో పాటు వత్తి, వినియోగాన్ని వండిస్తున్నారని తెలిపారు. కాటన్ విత్తనాల వినియోగాలను నివారించాలని సూచించారు. అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తు వంటలు వేసుకుంటే అధిక లాభాలు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏతతో కుమార్, నక్కలపల్లి సర్పంచ్ యాదయ్య, ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్, వార్డు సభ్యులు, మహిళా సమన్యాయ సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ మార్కులు సాధిస్తే ప్రోత్సాహక బహుమతులు

-విద్యార్థులకు పరీక్షా సామాగ్రీ పంపిణీ



విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లు, పెన్నులు అందజేస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:** పదవరతగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు రూ.25వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి-వైఎస్ రెడ్డి ట్రస్టు చైర్మన్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని అవుషాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం పదవతరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఎస్‌సీ పరీక్షలపై ఆయాపాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆయన చర్చించారు. ఈసందర్భంగా పది పరీక్ష రాసే వారికి పరీక్షా ప్యాడులు, పెన్నులను అందజేశారు. 550 మార్కులు సాధించే విద్యార్థులకు పైచదువుల కోసం రూ.25 వేలు అందజేస్తామని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు కూలీ పని చేసుకొని తమను చదివిస్తున్నారని వారి చెమట చుక్కలు వృథా కాకుండా కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని ఆయన సూచించారు. పరీక్షల సమయంలో మొబైల్స్, టీవిలకు దూరంగా ఉండాలని సబ్జెట్‌లపై దృష్టి పెట్టి శ్రద్దగా పరీక్షలు రాయాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేసేలా క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు తెచ్చుకొని వారి పేరు నిలబెట్టాలని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అవుషాపూర్ మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేంధర్‌రెడ్డి, అంకుశాపూర్ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కప్పరగళ్ల పద్మా కరుణాకర్, బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, నాయకులు ఏనుగు మచ్చేంధర్‌రెడ్డి, సంగపురం సుజాత, కాలసు వెంకటేశ్‌గౌడ్, గాయరు రాజేశ్, గట్టుపల్లి మల్లేశ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాధుల నుంచి పశువులను కాపాడాలి



ఎదులాబాద్‌లో గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారిని పద్మిని

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:** పశువుల్లో గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండి) నివారణకు సంవత్సరానికి రెండు దఫాలుగా ఉచితంగా టీకాలు వేయిస్తున్నామని మండల పశువైద్యాధికారిణి ఎం.పద్మిని తెలిపారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లో గురువారం పశువులకు గాలికుంటు నిరోధక టీకాలను వేశారు. పశువులకు వ్యాధి సోకిన తర్వాత చికిత్స చేయించడం కంటే ముందస్తు టీకాలు వేయించడం మంచిదని ఆమె తెలిపారు. 6 నెలల వయస్సు పైబడిన పశువులకు టీకాలు వేయించడం ద్వారా పాలు తగ్గకుండా, చూడి పశువులు ఇసుకకుండా, దూడల మరణాలను అరికట్టి ఆరోగ్యంగా ఎదగడానికి టీకా దోహపడుతుందని తెలిపారు. 28 గేదెలకు 2 ఆవులకు గాలికుంటూ నిరోధక టీకాలను వేసినట్లు ఆమె పేర్కొన్నారు. పశువైద్య సిబ్బంది వచ్చి ఉచితంగా టీకాలు వేస్తున్నారని పశుపోషకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులు, ఆవులకు టీకాలు ఇప్పించాలని పద్మిని సూచించారు.

## భారీగా గంజాయి పట్టివేత

జవహర్‌నగర్ మార్చి 12 ప్రభాతవార్త : జవహర్‌నగర్‌లోని మల్లికార్జున్ నగర్ కాలనీలో గంజాయి విక్రయాలపై పోలీసులు దాడులు చేశారు. కౌశిక్ (23), దేవేంద్ర (22) అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశా రు. వారి వద్ద నుంచి సుమారు 1.05 కిలో ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## గంట ముందే పరీక్షా కేంద్రానికి వెళ్లండి

**పెద్దేముల్, మార్చి 12, ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని మం డల విద్యాధికారి నర్సింగ్‌రావు సూచించా రు. ఈ నెల 14 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని , పెద్దేముల్ జడ్పిహెచ్ఎస్ బాలురలో 200 మంది విద్యార్థులు, బాలికల పాఠశాలలో 188, మంబాపూర్ జడ్పిహెచ్ఎస్‌లో 180 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఆయా పాఠశాలలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు తదితర వసతులు కల్పించామన్నారు. ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్ష కొనసాగుతుందని, గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణతా శాతం తీసుకురావాలని ఆకాంక్షించారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, జరిమానా బాలిక కుటుంబానికి రూ.2 లక్షల నష్ట పరిహారానికి ఆదేశం

**మేడ్చల్, మార్చి 12, ప్రభాతవార్త :** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దోషికి మేడ్చల్ ఫోక్సో కోర్టు జైలు శిక్ష, జరిమానా విధిం చింది. ప్రభుత్వ న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2024లో అల్వాల్‌లో రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల బాలికపై పేయింటర్‌గా పని చేస్తున్న నారాయణ అనే కార్మికుడు పాఠశాలలోని బాత్‌రూంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ ఫోక్సో కోర్టులో కేసు విచారణ అనంతరం నారాయణకు కారాగారా శిక్షతో పాటు రూ 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెంకటేశ్ తీర్పు ఇచ్చారు. అలాగే భాదిత బాలిక కుటుంబానికి రూ.2 లక్షల నష్టపరి హరాన్ని ఇవ్వాలని కోర్టు ఆదేశించారు.

# గ్రామీణులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో వైద్య సేవలు అందించే ఆసుపత్రుల్లో ముందున్న స్థానిక బుగ్గారెడ్డి ఆసుపత్రి క్రమంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించే దిశగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా షాబాద్ మండలం హైతాబాద్‌లో బుగ్గారెడ్డి క్లినిక్‌ను గురువారం ప్రారంభించారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్ భీం భరత్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ఆధునిక నాణ్యత కలిగిన వైద్యాన్ని గ్రామానికి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. చుట్టుముట్టు ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భీమ్ భరత్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అవసరం ఉందని, ఇలాంటి సమయంలో క్లినిక్ ఏర్పాటు మంచి ఉద్దేశమని అభిప్రాయపడ్డారు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన





హైతాబాద్‌లో బుగ్గారెడ్డి క్లినిక్‌కు హాజరైన ప్రముఖులు

మెరుగైన వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు కూడా అందించాలని ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ అనురాగ్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సకాలంలో చికిత్స అందించి వారి ఆరోగ్యానికి అండగా ఉంటామని అన్నారు. గుడ్డి మల్కాపూర్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ కర్రోళ్ళ శాంతమ్మ, యాదయ్య, ఉప సర్పంచ్ హర్యానాయక్, షాబాద్ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ రాహుల్ పాల్గొన్నారు.

## లైఫ్ సైన్సెస్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి

..169మందికి సర్టిఫికెట్ల పంపిణీ
..తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిష్ట్రార్ డాక్టర్ యోగానందం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త:** బయోలాజికల్ -ఈ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైఫ్ సైన్సెస్ స్కిల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న 169మందికి విద్యార్థులకు సర్టిఫికెట్లను తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ యోగానందం అందజేశారు. గురువారం మొదటి కాన్వకేషన్ కార్యక్రమం జరిగింది. దీనిలో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ నరేంద్ర కూడ పాల్గొని సర్టిఫికెట్స్‌ను అందజేసి విద్యార్థులను అభినందించారు. దీనిలో 178మంది శిక్షణ పొందారని, వీరిలో 169మంది సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఇందులో 158మంది



లైఫ్ సైన్సెస్ స్కిల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిష్ట్రార్ డాక్టర్ యోగానందం,పాల్గొన్న తదితరుల దృశ్యం

వరకు ప్లేస్‌మెంట్స్ పొందినట్లు , మరో 30మంది శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి శిక్షణలో ఆసక్తిఉన్న విద్యార్థులు 9493393797, 9492099091లను సంప్రదించవచ్చని వారు సూచించారు.

## యూత్ నేషనల్ వాలీబాల్‌కు నాగసాయి ఎంపిక

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:** యూత్ నేషనల్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ జట్టుకు విబిఐటి విద్యార్థి ఎం.నాగసాయి బులిరెడ్డి ఎంపిక అయ్యారు. ఈనెల 15వ తేదీ నుంచి 20 వరకు ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లోని కెఐటిఎస్ (కిట్స్) యూనివర్సిటీలో జరిగే 26వ యూత్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ నోటీల్లో నాగసాయి ఆడనున్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ సమీపంలోని విజ్ఞాన భారతీ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ (సీఎస్‌సి) చదువుతున్న నాగసాయి వాలీబాల్‌లో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్యదర్శి డాక్టర్ జి.మనోహార్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేస్తూ నాగసాయిని అభినందించారు. తెలంగాణా రాష్ట్ర వాలీబాల్ జట్టు ఈనెల 13న బయలుదేరి 15వ తేదీన జరిగే యూత్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో ఆడతారని తెలంగాణ వాలీబాల్



విబిఐటి చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి మనోహార్‌రెడ్డిలతో వాలీబాల్ క్రీడాకారుడు నాగసాయి

అసోసియేషన్ అధ్యక్షులు జి.రమేశ్‌బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎస్ శ్రీనివాస్, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డాక్టర్ సుష్మ, పిడి ఎం.శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన ప్రజాప్రతినిధులు

## సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, చైర్‌పర్సన్, వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పలకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ తదితర కౌన్సిలర్లు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వ యంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభు త్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవు తా యని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే ఉటం కిస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రజలకు ఏ విధంగానైతే ప్రామాణికమైన ఫలితాలు అందు తాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులపై పాలకవర్గం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విశాల, జమాల్పూర్ సంతోషి బాయ్, నడికుడ శ్రావణి, ఎస్పీ శివ, సింగపగ శిరీష, ఒగ్గు జయలక్ష్మి, ఆరిఫా బేగం, గౌస్ జానీ, పెంటయ్య, రాజు నాయక్, పినమోని గోపాల్, పిల్లి శారద, సుధీర్, బచ్చలి నరేష్, మురళీమోహన్ అప్పి, ప్యాట అశోక్, కళ్యాణ్ కార్ దిలీప్, కొప్పునూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక మంత్రి అజారుద్దీన్

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ప్రఖ్యాత జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి మరిన్ని నిధులు అదనంగా మంజూరు చేయాలని మైనారిటీ సంక్షేమం, ప్రజా సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. గురువారం రాజధానిలో మంత్రి అజా రుద్దీన్‌ని తన కార్యాలయంలో ప్రత్యేకంగా కలుసుకుని జహంగీర్ దర్గా అభివృద్ధి గురించి మాట్లాడారు. దాదాపు 12 కోట్ల హెచ్.ఎం.డి.ఏ నిధులతో దర్గా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మరో 8 కోట్ల రూపా యలు నిధులు అదనంగా మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా దర్గా అభివృద్ధికి సహకారం పెద్ద ఎత్తున అందించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి అజారుద్దీన్ ఇటీవల దర్గాను సందర్శించడం జరిగిందని, దర్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చర్యలు చేపట్టి అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తుందని అన్నారు.



దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## భూ భారతి సర్వే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

**పెద్దేముల్, మార్చి 12, ప్రభాతవార్త:** గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టంగా చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని, భూ భారతి చట్టం ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం కాబోతోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం గిర్మాపూర్‌లో నిర్వహించిన భూభారతి-సమగ్ర భూసర్వే కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. సర్వే జరుగుతున్న రైతు రాంరెడ్డి పొలాన్ని సందర్శించారు. స్థానిక రైతులతో పాటు సర్వేయర్లతో మాట్లాడి సర్వే సమయంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియ తీరును స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ధరణి స్థానంలో భూ భారతి వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. గతల పాలకుల నిర్లక్షంతో రెవెన్యూ వ్యవస్థ గందరగోళానికి గురైందని విమర్శించారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలన్న లక్ష్యంతో అధికారులు గ్రామాలకే వచ్చి సమగ్ర సర్వే నిర్వహించేలా ఆదేశాలిచ్చామని తెలిపారు. పట్టా సర్వే నెంబర్ స్థానంలో భూధార్ నెంబర్ ఉంటుందన్నారు. భూ సర్వేలో భాగంగా పట్టా భూమి, గ్రామకంఠం, ప్రభుత్వ భూములను స్పష్టంగా వేరు చేసి గుర్తిస్తారని తెలిపారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను రెవెన్యు మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేయడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు పారదర్శకమైన సుస్థిరమైన భూ రికార్డు వ్యవస్థ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరాం నాయక్, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, నాయకులు లోంక నర్సిములు, రాంరెడ్డి, సాయిపూర్ నర్సిములు, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, డీటి శ్రీనివాసులు, ఆర్ఐ సైమన్ పాల్గొన్నారు.





రైతుల నుంచి భూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే





పొన్నాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను ఉచితంగ పంపిణీ

## విద్యార్థులు టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

..12వ వార్డు కౌన్సిలర్ ఎం.మౌనికశివవీరప్రసాద్ ..పొన్నాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు ఉచితంగ పరీక్షల మెటీరియల్ పంపిణీ..ప్యాడ్స్,జామెట్రీ బాక్సులు, పెన్నులు, స్కేల్స్,వాటర్ బాటిల్స్ పంపిణీ

**శామీర్‌పేట, మార్చి 12, ప్రభాతవార్త:** విద్యార్థులు పదవతరగతి మంచి ఫలితాలు సాధించాలని, ఉన్నత చదువులు చదవాలంటే కష్టపడి చదవాలని మూడుచింతలపల్లి మున్సిపల్ (పొన్నాల్) 12వవార్డు కౌన్సిలర్ మ్యాడబోయిన మౌనిక శివవీరప్రసాద్ సూచించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పొన్నాల్‌లో 12వ వార్డు కౌన్సిలర్ దాత ఎం.మౌనికశివవీరప్రసాద్ పదవతరగతి విద్యార్థుల పరీక్షలకు సంబంధించి సామాగ్రి ప్యాడ్స్, జామెట్రీబాక్స్‌లు, పెన్నులు, స్కేల్స్, వాటర్ బాటిల్స్‌ను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకుంటారని భావించి సేవా భాగంగా వారికి పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు ఆ కౌన్సిలర్ తెలిపారు. పరీక్షల మెటీరియల్‌ను అందజేసిన కౌన్సిలర్ ఎం.మౌనికశివవీరప్రసాద్‌కు దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాద్యాయులు, పాఠశాల చైర్మన్ అజయ్‌లక్ష్మి,11వ వార్డు కౌన్సిలర్ కొలాసు రాజు, మున్సిపల్ బిఆర్ఎస్ నాయకులు పి.సతీష్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పిట్టల రమేశ్, మాజీ వార్డుసభ్యులు శివశంకర్, నాయకులు తలారి కృష్ణ, ఎం.పాపయ్య, ఎం.బాల్‌రాజు, విద్యార్థులు,పాల్గొన్నారు.

## తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

**శామీర్‌పేట, మార్చి 12, ప్రభాతవార్త:** తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు జ్వరం, దగ్గు, జలుబు, వంటి సాధారణ సమస్యలను పరిశీలించి పరీక్షించి చికిత్సలకు సంబంధించిన మార్గదర్శకాలను తెలియజేశారు. అత్యవసర పరిస్థితిలో ప్రాణాలను కాపాడే సిపిఆర్ విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించటం, పోషకాహారం, తీసుకోవటం, అనీమియా నివారణ వంటి ముఖ్య అంశాలపై వైద్యులు వారికి వివరించారు. అత్యవసర సేవలకు సంబంధించి హెల్ప్‌లైన్ నెంబరు 14416కు సమాచారం అందించాలని సూచించారు. దీనిలో వైద్యులు డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ మౌనిక, ఫార్మాసిస్ట్ పవిత్ర, ఎఎన్ఎం తులసి, ఆర్‌బిఎస్‌కె ఎంహెచ్‌టి బిటీమ్ మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని పాఠశాల వారు తెలిపారు.



జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో జరిగిన వైద్య శిబిరం దృశ్యం

## ఆక్సా వెల్ఫేర్ అసోసిషియేషన్ ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి మున్సిపల్ సిబ్బందికి బట్టల పంపిణీ

**శామీర్‌పేట, మార్చి 12, ప్రభాతవార్త:** ఆక్సా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూంకుంటలో జిహెచ్ఎంసి పారిశుద్య కార్మికులకు, సిబ్బందికి రంజాన్ పండుగను పురస్కరించుకుని బట్టలను పంపిణీ చేశారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో వారు రంజాన్‌ను పుర స్కరించుకుని పారిశుద్య కార్మికులకు, సిబ్బంది బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని పంపిణీ చేసిన వారిలో మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్,నాయకులు కె.ఈశ్వం గౌడ్, మాజీ కౌన్సిలర్‌లు రాజుయాదవ్, మధుసూదన్‌రెడ్డి, దావూదీయ మజీద్ అధ్యక్షులు బాబా, కమిటీ సభ్యులు ఎండి ముదస్సర్, ఖ్యారా ఫౌండేషన్ చైర్మన్ కూడ పాల్గొన్నారు. ఆక్సా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహబూబ్ జానీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 150మంది పేదలకు,కార్మికులకు జిహెచ్‌సిఎంసి పారిశుద్ధ్య కార్మికులకు రేషన్‌కిట్లను, బట్టలను, చీరలను అందజేశారు.



ఆక్సా వెల్ఫేర్ అసోసిషియేషన్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా తూంకుంటలో జిహెచ్‌ఎంసి మున్సిపల్ సిబ్బందికి బట్టల పంపిణీ చేసిన దృశ్యం

## కోట్లల్లో అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలనూ ఇస్తున్నాం

**ధారూర్, మార్చి 12, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులను భరిస్తూనే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెలకు 6,500 కోట్ల రూపాయల అప్పులు కడుతూ మరోవైపు సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ధారూర్ మండల పరిధిలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మండలంలోని నాగ్ సాన్ పల్లి గ్రామంలో 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం ధారూర్ బస్ స్టాండ్ ఆవరణలో 24 లక్షల రూపాయల వ్యయంతో వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే డబుల్ బెడ్ రూం కాలనీ వద్ద 25 లక్షల రూపాయల సీసీ రోడ్ల పనులకు, 15 లక్షల రూపాయల అండర్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ, రాబోయే ఆరు నెలల కాలంలో మహిళలకు 2,500 రూపాయల, పెన్షన్ పెంపు, నిరుద్యోగులకు వృత్తి భృతి, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ధారూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ ఉమేశ్వర్, డిఈ శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వో స్వాతి, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింలు, ఎంపీఓ షఫీ ఉల్లా ఖాన్, ఎఈ సమీర్, మండల పార్టీ అధ్యక్షులు మాన్సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, సంతోష్, మాజీ జడ్పీటీసీ రాములు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, యూనుస్, బాబా ఖాన్, దావూద్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



## రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**పూడూరు, మార్చి 12, ప్రభాతవార్త :** పూడూరు మండల కేంద్రం సమీపంలోని దామగుండం శ్రీ రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండము, రుద్రాభిషేకం, సాయంత్రం కళ్యాణోత్సవం, రాత్రి 10 గంటలకు రథోత్సవం నిర్వహిం చనున్నట్లు ఉత్సవకమిటి సభ్యులు వివరిం చారు. 14 ఉదయం 10గంటలకు బిల్వాపుష్పార్చన, రాత్రి 9గంటలకు దోపోత్సవం, ఉంటాయని తెలిపారు. 15 ఉదయం 6గంటలకు రుద్రాభిషేకం, పుష్పార్చన, 16 ఉదయం 6గంటలకు రుద్రా భిషేకం, 10-30గంటలకు చక్రతీర్థము కార్య క్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వివరిం చారు. వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.